
www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 8 ఫిబ్రవరి 2025

5

తిరుపతి



అంత్యక్రియలకూ అగచాట్లు!

- పూడ్చడానికీ ఆరు అడుగుల స్థలం కరువు
- శ్మశానానికి పొలాలే దారి..
- మోసుకెళ్లాలన్నా మనుషులు రాని వైనం



దారి లేక వరి పొలంలోనే మృతదేహాన్ని మోసుకెళుతున్న గ్రామస్తులు


ప్రజాశక్తి -కెవిబిపురం: ప్రతి వ్యక్తి జీవితం చివరి మజిలీ శ్మశానమే.. అక్కడ కనీస సౌకర్యాలు లోపించడంతో పడరాన్ని పాట్లు పడాల్సి వస్తోంది. మండలంలో పలు చోట్ల శ్మశానాలకు దారి లేక పొలాల్లో వెళ్లాల్సి వస్తోంది. మరి కొన్ని చోట్ల శ్మశాన స్థలం లేక రహదారి పక్కనే మృతదేహాలను పూడ్చి వెనుదిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో మృతదేహాలను మోసుకెళ్లాలంటే నరక యాతన పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతి నిధులు, అధికారులు స్పందించి శ్మశాన స్థలాలు, దారి లేని శ్మశానాలకు దారి సౌకర్యం కల్పించాల్సిన అవసరం వుంది.

కెవిబిపురం మండలంలోని 39 పంచాతీలు, 39 రెవెన్యూ గ్రామాలు వున్నాయి. మొత్తం 42,111 మంది జనాభా నివసిస్తున్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు ప్రభుత్వం కొన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సి వుంది. అందులో భాగంగానే ప్రతి గ్రామంలో శ్మశానవాటికను వాటికి వెళ్లేందుకు దారులను ఏర్పాటు చేయాల్సి వుంది. అయితే స్వాతంత్రం వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా కెవిబిపురం మండలంలో కొన్ని గ్రామాల ప్రజలకు ఇప్పటి వరకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించలేదని వాపోతున్నారు. మండలంలోని మహాదేవపురం, పెరిందేశం, కొత్తూరు, దిగువ పుత్తూరు, బ్రాహ్మణపల్లి గ్రామాలలో ప్రజలు ఎవరైనా మృతి చెందితే శ్మశాన వాటిక లేక రోడ్ల పక్కనే పాతి పెట్టాల్సి వస్తోంది. కొన్ని గ్రామాలలో శ్మశాన వాటికి ఉన్నా వెళ్లేందుకు దారులు లేక మృతదేహాన్ని కాటికకు తీసుకువెళ్లాలంటే కష్టాలు తప్పడం లేదు..

శ్మశానానికి పొలాలే దారి

పెరిందేశం గ్రామ శ్మశానానికి ఏడు ఎకరాల స్థలం కేటాయించారు. కానీ నేడు సెంటు భూమి కూడా లేకపోవడంతో అక్కడ చనిపోయిన వారి అంతిమ యాత్ర కష్టాల కడలిలోనే ముగించాల్సిన దుస్థితి నెలకొంటోంది. పెరిందేశం గ్రామానికి చెందిన ఓ రైతు ఇటీవల విద్యుత్ సాక్‌తో మృతి చెందాడు. ఆయన అంతిమ సంస్కారానికి సుమారు కిలోమీటరు దూరం వరి సాగుకు సిద్ధం చేసిన పొలం వెంట వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. బురద, పొలంగట్లుపైనే ఇలా స్థానికులు ఇబ్బంది కర పరిస్థితుల్లో భుజంపై మోసుకువెళ్లి అంతిమ సంస్కారాన్ని ముగించాల్సి వచ్చింది. నలుగురు వ్యక్తులు భుజంపై మృత దేహాన్ని మోసుకుని వెళుతుండగా ప్రమాదకర స్థితిలో బురద, పొలం గట్లపై పలుమార్లు కిందపడి కాళ్లు విరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో మృతదేహాన్ని శ్మశానానికి మోసుకెళ్లేందుకు ఒక్కో సమయంలో నలుగురు వ్యక్తులు కూడా ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆక్రమణలో ఉన్న శ్మశాన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని దారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అర్జీలు ఇచ్చినా పరిష్కరించలేదు..



మండలంలో దిగువ పుత్తూరు, మహదేవపురం, తదితర గ్రామాల ప్రజలు అనేక పర్యాయాలు అధికారుల వద్ద ఆందోళన చేపట్టి అర్జీలు ఇచ్చారు. అయినా ఆ గ్రామాలు నేటికీ దారి సౌకర్యం లేక ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు స్పందించడం లేదు. ప్రజల కష్టాలు చూసి జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలో వున్న శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలి.

- దాసరి జనార్ధన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు.

తిప్పలు తప్పడం లేదు..



గ్రామంలో ఎవరు చనిపోయినా తిప్పలు తప్పడం లేదు.. దీనిపై పలుమార్లు ప్రజా ప్రతినిధుల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకు వెళుతు న్నా ఏమాత్రం పట్టించుకోవడంలేదు.. మృతదేహాలను పూడ్చేందుకు తీసుకెళ్లాలన్నా కష్టాలు ఎదుర్కొం టున్నాం.. ఇటీవల మా అత్త చనిపోయింది.. ప్రమాదకర స్థితిలో ఆమెను శ్మశానానికి మోసుకు వెళుతుండగా కిందపడి కాళ్లు నొప్పి పట్టుకున్నాయి. ఇలాంటి సంఘటన లు ఎన్నో ఉన్నాయి.. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే శ్మశానానికి మోసుకెళ్లేందుకు ఒక్కో సమయంలో ఎవరూ ముందుకు రావడం లేదు.

- కరుణాకర్ రెడ్డి, కొత్తూరు గ్రామస్తుడు.

ఆక్రమణపై కఠిన చర్యలు తీసుకుంటాం..




మండలంలో శ్మశాన స్థలాలను ఆక్రమించిన ఏ గ్రామంలో అయినా కఠిన చర్యలు తీసుకుంటాం.. ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాలను గుర్తించి వాటిని వెంటనే సర్వే చేస్తాం.. ఎవరైనా శ్మశాన దారులను, కాలువ పోరంబోకు స్థలాలను ఆక్రమించి వుంటే గుర్తించి చర్యలు తీసుకుని శ్మశానాలకు దారి సౌకర్యం కల్పిస్తాం..

- మునిరత్నం, తహశీల్దారు, కెవిబిపురం.

వేధింపుల నుండి రక్షించండి

- స్విమ్స్ కార్మికులకు న్యాయం చేయాలి
- 10న ధర్నాను జయప్రదం చేయండి
- సిఐటియు నాయకుల పిలుపు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: స్విమ్స్ ఆస్పత్రిలో గత 32 ఏళ్లకు పైగా పని చేస్తున్న కార్మికులకు యాజమాన్య వేధింపుల నుండి రక్షణ కల్పించి న్యాయం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. స్విమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10వ తేదీ సోమవారం స్విమ్స్ ప్రాంగణంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను సిఐటియు కార్యాలయంలో నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భం గా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం, స్విమ్స్ కార్మికుల యూనియన్ వర్కింగ్ ప్రసిడెంట్ కే వేణుగోపాల్, యూనియన్ కార్యదర్శి జి రవి మాట్లాడుతూ చిరు ఉద్యోగులైన కార్మికులను నర్సింగ్ సూపరింటెండెంట్ టి ప్రభావతి వేధింపుల నుంచి కాపాడాలని, స్విమ్స్ ఆస్పత్రి ఏర్పాటైనప్పటి నుంచి పనిచేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం చిన్నచూపు చూస్తోందన్నారు. కార్మికులపై తీవ్రమైన పని భారం ప్రశ్నిస్తే ఉద్యోగాల నుంచి తొలగించడం, చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని దీనికి మూల కారణం నర్సింగ్ సూపరింటెండెంట్ టి ప్రభావతి వేధింపులేనని కార్మికులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. కనీసం పనిచేసే పరిస్థితి లేక తల్లడిపోతున్నారన్నారు. గతంలో వార్డు బాయ్‌లుగా ఉన్న పేరును మార్చి శానిటేషన్ అని బిరుదు ఒకటి తగిలించారని, దాని మూలంగా జీతాలు పెంపునకు అవరోధంగా మారిందన్నారు. పనులు చేయించేటప్పుడు ఒత్తిడి పెంచడం, జీతాలు ఇచ్చే టప్పుడు ఇస్తున్న జీతమే చాలా ఎక్కువ అని కార్మికులను మాటలతో, చేష్టలతో ఆమె తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు కోరారు. గతంలో వైసిపి ర్యాలీకి 400 మంది నిరుద్యోగులను బాలాజీ కాలనీ నుండి కిలోమీటర్ల దూరం మండుటెండలో దారుణంగా నడిపించారన్నారు. అందులో గాయపడిన కార్మికురాలికి ఎలాంటి సాయం అందించ లేదన్నారు. ప్రశ్నించిన వారిని ఇంటికి పంపడమే ఆమె నైజమని, ఆరు నెలల కాలంలో 60 మందిని పైగా ఎలాంటి నోటీసులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇంటికి పంపేశారని పేర్కొన్నారు. నాయకులను వారికి గుండెపోటు వచ్చేవరకు వేధిస్తారని, ఈఎస్ఐ ఆసుపత్రిలో డాక్టర్లు ఇస్తున్న సిక్ లీవులను కూడా తిరస్కరిస్తున్నారన్నారు. కార్మికులపై ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ పై ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని, తొలగించిన కార్మికు లంద రినీ విధుల్లోకి తీసుకోవాలని, అక్రమ తొలగింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న ధర్నాలో స్విమ్స్ కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొవాలని కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు వీ సూరి, ఎం గోపి, పి వెంకటేష్, ఎస్ సమీమ్ నిషా పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, స్విమ్స్ కార్మిక యూనియన్ నాయకులు

అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు తగిన వేతనం ఇవ్వాలి

పార్లమెంట్‌లో మద్దిల గురుమూర్తి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, సెర్ప్, మెప్మా పథకాలలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్ తీవ్ర అసమానతలకు గురవుతున్నారని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి శుక్రవారం పార్లమెంటు జీరో అవర్‌లో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఉద్యోగులు తమ జీవితాలను సమాజ సేవ కోసం అంకితం చేస్తూనే కనీస వేతనం కూడా అందుకోలేని దుస్థితిలో ఉన్నారని ఆయన తెలిపారు. వీరి సేవలు వెలకట్టలేనివని, వారికి చెల్లిస్తున్న జీతాలు కనీస జీవనోపాధికి కూడా సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతన చట్టం ప్రకారం సరైన జీతాలు అందించాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఇతర సేవకులు చాలా తక్కువ వేతనాలతో పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది బందీకృత కూలీల స్థాయికి పడిపోయిందని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. సమాజానికి అత్యంత కీలకమైన ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసే వీరు తగిన వేతనాలను పొందలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సేవకుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, సమిష్టి హక్కులను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేసి, వీరికి తగిన పారితోషికం అందించాలని కోరారు. అంతేగాక, వీరికి సామాజిక భద్రతను కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. మానవతా దృక్పథంతో వీరి హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని, వీరి సేవలను గుర్తించి ప్రావిడెంట్ ఫండ్, వైద్య భద్రత, పింఛను వంటి ప్రయోజనాలు కల్పించాలని ఎంపీ కోరారు.

బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట నక్కల కాలనీ రైల్వే ట్రాక్ లైన్ విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న 52 మంది బాధితులకు 2013 చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని, ఇంటి స్థలంతో పాటు ప్రభుత్వమే హౌసింగ్ ఇల్లు మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇవ్వాలని, గిరిజన తెగకు చెందిన షికారీలకు ఇతర కులస్తుల వారికి కుటుంబంలో ఒక్కొక్కరికి రైల్వే రంగంలో ఉద్యోగం ఇచ్చి జీవనోపాధి కల్పించాలని ఇందుకు ఉన్నతాధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టకుండా రేణిగుంట నక్కల కాలనీకి చెందిన షికారులను రాత్రి 1 గంట సమయంలో అధికారులు చెప్పారని పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేసి గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని, అరెస్టులను ప్రశ్నించిన గిరిజన షికారులపై పోలీసులు చేయి చేసుకోవడం, దురుసుగా ప్రవర్తించడం పట్ల ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్, రేణిగుంట సిపిఎం సీనియర్ నాయకుడు ఓ వెంకటరమణ శుక్రవారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు హరినాథ్, సిపిఎం నాయకులు వెంకటరమణ మాట్లాడుతూ..కలెక్టర్, రైల్వే ఉన్నత అధికారులు వెంటనే స్పందించి 'రైల్వే ట్రాక్ లైన్ విస్తరణ' లో ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ '2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయం చేయాలని' లేని పక్షంలో బాధిత నిర్వాసితులకు అండగా పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఉన్నత అధికారులను హెచ్చరించారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి..

స్మార్ట్ సిటీ ఎండి ఎన్ మౌర్య

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో పెండింగ్ వాటిని త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను, ప్రాజెక్టుల ప్రతినిధులను ఆదేశించారు. స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆయా ప్రాజెక్టుల ప్రతినిధులు, అధికారులతో శుక్రవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ ఆయా ప్రాజెక్టుల్లో పెండింగ్‌లో ఉన్న పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గరుడ వారధిలో కూడళ్లు, డివైడర్లు, గోడల సుందరీకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టి లెవెల్ కార్ పార్కింగ్, తదితర ప్రాజెక్టులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు చంద్రశేఖర్, శ్యాంసుందర్, డిఈలు రాజు, మహేష్, మధు, ప్రసాద్, ఏఓ రాజశేఖర్, సిఎఫ్ఓ మల్లికార్జున, ఏ ఈకాం ప్రతినిధులు బాలాజి, అనిల్, అఫ్కాన్స్ ప్రతినిధి స్వామి, ఐ ట్రిపుల్ సి, మల్టి లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టుల ప్రతినిధులు పాల్గొన్నారు.



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం పలుకుతున్న అధికారులు

ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం

ప్రజాశక్తి -రేణిగుంట: శుక్రవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కి ఘనస్వాగతం లభించింది. జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి థర్డ్ ఎడిజె జస్టిస్ ఎం గుర్నాథ్, ప్రోటోకాల్ జడ్జి కోటేశ్వర రావు, కోర్టు సూపరింటెండెంట్ ధనుంజయ నాయుడు, తిరుపతి బార్ కౌన్సిల్ సభ్యులు, తదితరులు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలికిన వారిలో వున్నారు. హైకోర్టు సీజే వెంట చిత్తూరు ఉమ్మడి జిల్లా పోర్ట్ ఫోలియో హై కోర్టు జడ్జి కృష్ణ మోహన్ , హై కోర్టు జడ్జి టిసిడి శేఖర్ కూడా ఉన్నారు. స్వల్ప విశ్రాంతి అనంతరం హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి రోడ్డు మార్గాన మదనపల్లె కు బయల్దేరి వెళ్లారు. వారు శనివారం మదనపల్లె, పలమనేరు కోర్టు భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన నున్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఎన్ మౌర్య

ప్రజలకు అందుబాటులో ఉండాలి

సచివాలయ సిబ్బందికి కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని శ్రీనివాసం, పెద్దకాపు లేఔట్, ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, రెండో వార్డులోని సచివాలయాలను, చేపల మార్కెట్ ఏర్పాటుకు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వారి వారి సచివాలయాల పరిధిలో చేయాల్సిన అన్ని సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది నగరంలోని అన్ని ప్రాంతాల్లో పర్యవేక్షిస్తూ అనధికారిక లేఅవుట్లు, తదితరాలను గుర్తించి కట్టడి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిఈలు రమణ, రాజు, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసిపి బాలాజి, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి పాల్గొన్నారు.

శెట్టిపల్లి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- రెండు మూడు వారాల్లో పెండింగ్ లేఔట్ల ప్రొసీడింగ్స్ ప్రతులు అందిస్తాం..
- కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: దీర్ఘ కాలంగా అపరిష్కృత శెట్టిపల్లి భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చొరవతో అన్ని చర్యలు చేపట్టామని, వచ్చే రెండు మూడు వారాల్లో పెండింగ్ వాటిని పరిష్కరించి లేఔట్లకు సంబంధించి పేపర్‌పై ఏర్పాటు, ప్లాటింగ్ చేసి ప్రొసీడింగ్స్ ప్రతులను లబ్ధిదారులకు అందిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. తిరుపతి నియోజకవర్గం శెట్టిపల్లి గ్రామ పెండింగ్ భూసమస్యలపై కలెక్టర్ జెసి శుభం బన్సల్, తుడా విసి ఎన్ మౌర్య, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తదితర సంబంధిత అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లే అవుట్ పెండింగ్ ప్రొసీడింగ్స్‌ను మంగళవారం నాటికి ఇచ్చేలా తిరుపతి ఆర్డీవో చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకూడదని ఆదేశించారు. ఈ భూముల పేపర్ ప్లాటింగ్, రహదారుల ఏర్పాటుకు, మౌలిక సదుపాయాల కల్పన కు తుడా మూడు వారాల లోపు ప్రణాళికా చర్యలు చేపట్టి పురో గతి చూపాలని ఆదేశించారు. అధికారికంగా పేపర్ పై లేఔట్ ప్లానింగ్ చేసి ప్లాట్లను లబ్ధిదారులకు చూపుతామని పేర్కొన్నారు. దీనిపై ఎలాంటి అపోహలు వద్దని తెలిపారు. ఈ సమావేశంలో తుడా సిపిఓ దేవి కుమారి, ఎస్‌డిసి తుడా అధికారిణి (భూసేకరణ) సృజన పాల్గొన్నారు.

వెటర్నరీ విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ మద్దతు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : గత ఆరు రోజుల నుంచి శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలో చదువుతున్న వారికి స్టైఫండ్ పెంచాలని విద్యార్థులు చేస్తున్న పోరాటానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల సమన్వయకర్త, పరిశోధక విద్యార్థి అశోక్ కుమార్ శుక్రవారం సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వెటర్నరీ విద్య చదువుతున్న ప్రతి విద్యార్థికీ ప్రతినెల ప్రభుత్వం ఇచ్చే స్టైఫండ్ ఏడువేల నుంచి ఇరవైవేల రూపాయలకు పెంచాలని, ఎంబిబిఎస్ , ఇతర వైద్య విద్యార్థు లకు ప్రతి సంవత్సరం పెంచుతున్నట్లు వెటర్నరీ విద్యార్థులకు కూడా స్టైఫండ్ పెంచాలని, అంతే కాకుండా వివిధ ప్రభుత్వ యూనివర్సిటీల్లో పరిశోధన చేస్తున్న పీహెచ్‌డి విద్యార్థులకు ప్రతి నెలా పదిహేను వేల రూపాయలు నాన్ -నెట్ ఫెల్లోషిప్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే వేలమంది విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌వి వెటర్నరి విశ్వవిద్యాలయ విద్యార్థులు

ఎంతో ఆనందం..

- మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజేత కావడం అభినందనీయం
- భావనరెడ్డి చిన్నతంబుకు ముఖ్యమంత్రి, మంత్రి ప్రశంస

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): మా చంద్రగిరి అమ్మాయి భావనరెడ్డి చిన్నతంబు మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజేతగా నిలవడం ఆనందంగా వుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజేత భావనరెడ్డి చిన్నతంబు గురువారం తన తండ్రి రియల్టర్ సి గోపికృష్ణతో అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిశారు. ఈ సందర్భంగా 2023లో మిస్ ఇండియా ఐరానిక్ దివా విజయం సాధించగా ప్రస్తుతం మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజయం పట్ల తన అనుభవాలను ఆమె ముఖ్యమంత్రికి వివరించారు. ఈ క్రమంలో తనకు లభించిన ఈ గౌరవాన్ని సమాజ హితం కోసం వినియోగించనున్నట్లు తన మనోభావాలను సిఎంకు వివరించారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు (ప్లాస్టిక్పై) ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు తనవంతు కృషి చేయనున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో తన సంతోషాన్ని వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి భావనకు అందుబాటులో వుండాలనీ, సామాజిక కార్యక్రమాలకు తన పూర్తి మద్దతు వుంటుందన్నారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతానికి చెందిన గోపికృష్ణ, లక్ష్మి దంపతులు తన కుమార్తెను ఎంతో కష్టపడి ఈ స్థాయికి తీసుకురావడం పట్ల ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

భావన రెడ్డికి ఘన సన్మానం

మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజేత భావనరెడ్డి చిన్నతంబును మంత్రి కొల్లు రవీంద్ర ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, రవాణా శాఖ మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డిలను ఆమె మర్యాద పూర్వరంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు ఆమెను అభినందిస్తూ దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. గోపికృష్ణ కుటుంబంతో సుదీర్ఘ అనుబంధం కలిగిన మంత్రి భావన విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా కలలవడానికి ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో మంత్రి మరోసారి భావన రెడ్డికి కిరీటధారణ గావించి తెలుగింటి అమ్మాయి అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. భావన రెడ్డి చేపట్టే సామాజిక కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో తనువంతు సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజున్, పులికంటి మోహన్ రెడ్డి, ఆర్.బాలాజీ, ఆర్, ప్రదీప్, చెరుకూరి శేఖర్, కోటేశ్వర్ రావు, బాషా పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి తిరుమల లడ్డూలు అందిస్తున్న భావనరెడ్డి చిన్నతంబు

డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత

ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సమాజంలో డ్రగ్స్‌కు బానిసలైన వారు చాలా ఎక్కువగా వున్నారని డ్రగ్స్‌ని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై వుందని అందరి సహకారంతోనే తిరుపతి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లా గా మారుద్దామని జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజు తెలిపారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ పదార్థాలపై అవగాహన సమావేశం కరకంబాడి రోడ్ లోని ఫ్యాబ్ బిల్డింగ్ లో సిహెచ్ హరిప్రసాద్ డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్, మెడికల్ షాప్ యజమానులతో సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ డ్రగ్స్ ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాలను కలిగిస్తాయని, ఫార్మసీ యజమానులు తమ ప్రాంతాల్లో డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులను లేదా అలాంటి మందుల కోసం షాపు లను సందర్శించే వారిని గుర్తించా లని, తదుపరి చర్యలు తీసుకోవ డానికి ఆ వ్యక్తుల వివరాలను పోలీసు శాఖకు తెలపాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు కూడా మత్తుకు అలవాటు పడి వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. దీనికి తోడు గంజాయి కూడా ఎక్కువగా వాడుతు న్నారు. మత్తుకు అలవాటు వారు నేరాలకు పాల్పడుతున్నారన్నారు. నేరాలు చేయడం వల్ల వారి భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. మెడికల్ షాప్ నిర్వాహకులు వ్యాపార పరంగా కాకుండా సమాజం బాగు కోరుకునే విధంగా వ్యవహరించాలని సూచించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎవరైనా వచ్చి మందులు అడిగితే ఇవ్వకూడదని సూచించారు. మత్తుకు అలవాటు పడిన వాళ్లు ఫోన్ లో ప్రిస్క్రిప్షన్ చూపించి మందులు తీసుకెళుతుంటారని, ఆ ప్రిస్క్రిప్షన్ ఏ డాక్టర్ ఇచ్చారని నిర్ధారణ చేసుకున్న తరువాత మందులు ఇవ్వాలని సూచించారు. రేపటి భావితరాల వారు చెడు వ్యసనాలకు పోకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై వుంది. మత్తు పదార్థాలు వాడటం వల్ల చిన్నవయసులోనే అనారోగ్యం సమస్యలు వచ్చి వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. మనం సమాజానికి మంచి చేస్తే మనకు మంచి జరుగుతుందని, ఈ కార్యక్రమం ద్వారా భావితరాలకు మేలు జరగాలని సూచించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా డబ్బుకు ఆశపడి మత్తు కల్గించే మందులు విక్రయిస్తున్నారని మా నోటిస్ కి వస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రుయా హాస్పిటల్ డాక్టర్ మానస, ట్రైన్ ఐపీఎస్ బి. హేమంత్, ఏ ఎస్ పి కే. రవిమనోహరాచారి, మహిళ డీఎస్పీ శ్రీలత, అలిపిరి సిఐలు, ఎస్ఐలు, జిల్లాలోని 400 మెడికల్ షాపు యజమానులు, మెడికల్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులు మరిచారు..

- కట్లు కట్టి తాత్కాలిక మరమ్మతులు- ప్రమాదకర స్థితిలో వ్యాయామ పరికరాలు



తాత్కాలికంగా కట్లు కట్టి వదిలేసిన వ్యాయామ పరికరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపల్ పార్కులో వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన పరికరాలు విరిగిపోయి మరమ్మ తులకు గురయ్యాయి. అక్కడికి వచ్చే ప్రజలు, పిల్లలు మరమ్మతులకు నోచుకోని వివిధ వ్యాయామ పరికరాలను ఆశ్రయిస్తున్న ప్రజలు, చిన్నపిల్లలు వివిధ ప్రమాదాల బారిన పడే అవకాశం వుందని, ఆరోగ్య కల్పనకు ఏర్పాటు చేసిన వాటి మరమ్మతులు చేపట్టి వెంటనే ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకర స్థితిలో వ్యాయామ పరికరాలు

స్థానిక మున్సిపల్ పార్కులో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే విరిగిపోయాయి. పిల్లలు, పెద్దల ఆరోగ్యం కోసం ఏర్పాటుచేసిన వ్యాయామ పరికాల కోసం ఈ పార్కుకు ప్రతి రోజూ వందల సంఖ్యలో వస్తుంటారు. అయితే ప్రస్తుతం అవి విరిగిపోయి నిరుపయోగంగా వున్నాయి. దీనిపై గతంలో మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు. మున్సిపల్ నిధులు లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు విరిగిపోయి ప్రమాదకర స్థితిలో వున్నాయి. పిల్లలు జారే పరికరం సగంలో విరిగిపోయి కొన్ని నెలలు గడుస్తోంది. ఎవరైనా పిల్లలు ఈ పరికరంపై మరిచిపోయి ఎక్కితే నడుం విరిగే ప్రమాదం వుంది. ఈ వ్యాయామ పరికరాలకు తాత్కాలికంగా కట్లు కట్టి వదిలివేశారు. ఈ కారణంగా మున్సిపల్ పార్కు కు వచ్చే వారు పూర్తి స్థాయిలో వ్యాయామానికి వినియోగించు కోలేకపోతున్నారు.

స్పందించని మున్సిపల్ అధికారులు

మున్సిపల్ పార్కులో వ్యాయామ పరికరాలకు వెంటనే మర మ్మతులు చేయాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా దీనిపై ఎలాంటి స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ శాఖ అధికారులు నామమాత్ర ఏర్పాట్లు చేసి అలాగే వదిలివేశారని వాపోయారు. సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి వ్యాయామ పరికరా లకు మరమ్మతులు చేసి ప్రజలకు వ్యాయామ పరికరాలు అందుబాటులోకి తీసుకురావాలని, ముఖ్యంగా జారుడు బండకు మరమ్మతు చేసి పిల్లలకు ఆటల వసతి కల్పించాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

డెలివరి కేసులు రెఫర్ చేయకండి : ఎమ్మెల్యే



వైద్యులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - సత్యవేడు: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే డెలివరీ కేసులను రెఫర్ చేయవద్దని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వైద్యులను కోరారు. శుక్రవారం సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పరమశివం, జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ సుందర్ రామిరెడ్డి, లోకయ్య రెడ్డి, బాల సుందరం రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే డెలివరీ కేసులు సుఖప్రసవం అయ్యేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్, ఇతర పారామెడికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రెండు రోజుల్లో 108 వాహనం అందబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చంద్రన్, సుహేల్, హెడ్ నర్స్ రమాగౌరి, టిడిపి నాయకులు మురళి (చికెన్ చిన్న), శశి, మోహన్ నాయుడు, జడేరి బాబు, సుబ్రహ్మణ్యం రాజు, శివానందం, ప్రభాకర్ రెడ్డి, రాధాకృష్ణ, రమణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవండి : ఎమ్మెల్యే ఆరణి



గీతం పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : గీతం స్కూల్ 13వ వార్షికోత్సవ వేడుకలు మహితి ఆడిటోరియంలో శుక్రవారం జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నానిలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని టీచర్ల సూచనలతో ఎదగాలని పిల్లలకు సూచించారు. విద్యార్థులు విజ్ఞానంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, ప్రిన్స్‌పల్ కిన్నెర శ్రీదేవి, జిల్లా రవాణ శాఖ అధికారి మురళీ మోహన్, లిటిల్ ఏంజెల్స్ స్కూల్ అధినేత్రి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానిని కలిసిన డిప్యూటీ మేయర్



ఎమ్మెల్యే నానితో డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ తదితరులు

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్) తిరుపతి రూరల్ పరిధిలోని తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్‌లో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మునికృష్ణకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ బ్లాక్ బోర్డర్ల పరిశీలన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని కుమార వెంకటాపురం గ్రామంలో రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ రీ సర్వేలో భాగంగా ఓన్ మండల్-ఓన్ విలేజ్ పైలట్ గ్రామంగా ఎంపిక కాబడిన కుమార వెంకటపురం గ్రామ రెవెన్యూ భూములను, సర్వే గుర్తులను, గ్రామ బ్లాక్ బార్డర్‌లను సర్వేయర్ పరిశీలించారు. ఈ సర్వేలో డివిజన్ డిప్యూటి సర్వేయర్ ప్రసాదరావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మించల నల్లయ్య, మండల సర్వేయర్లు రాజకుమార్, ఉదయరాజు, మురళి, తేజ, మురళికృష్ణలు పాల్గొన్నారు. ఈ సర్వేలో ఎవరికి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని జిల్లా సర్వే అధికారి అరుణ్ కుమార్ సూచించారు.

వైసిపి మండల కన్వీనర్‌గా మణి నాయుడు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కడ్రిగ: వైసీపీ మండల కన్వీనర్‌గా మణి నాయుడును ఆ పార్టీ జిల్లా నాయకులు నియమించారు. ఈ సందర్భంగా మణి నాయుడు మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇచ్చిన పార్టీ నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటూ, పార్టీ అభ్యుదయానిక, మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

ఘనంగా రియాజ్ అహ్మద్ జన్మదిన వేడుకలు



రియాజ్ అహ్మద్‌ను శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బాలింతలకు బేబి కిట్లు, పండ్లు అందచేశారు. ఆయన మాట్లాడుతూ సేవ, స్నేహ భావమే మనిషికి నూతన ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇంజినీర్లు బి.సీనయ్య, వి.వి.దయాళ్, క్లబ్ సభ్యులు మదనమేటి రమణయ్య, క్లబ్ అధ్యక్షులు ఆర్.రవిచంద్ర, క్లబ్ మాజీ అధ్యక్షులు జక్కం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కళ్యాణ సాయి, జగదీష్ చంద్ర, ఆర్ఎస్ మొబైల్స్ రాధాకృష్ణ, డిఎస్ఆర్ మొబైల్స్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మధురైలో జరిగిన నేషనల్ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలలో పుత్తూరుకు చెందిన భానోదయ విద్యాని కేతన్ చిన్నారులు ప్రథమ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ విజేతలను అభినందించారు.



ప్రతిభ చూపిన చిన్నారులు

గంగమ్మ ఆలయానికి విరాళం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతికి చెందిన జెకె రాయల్ తాతయ్యగుంట గంగమ్మ గుడికి లక్ష 116 రూపాయలు విరాళం ఆలయ ఈఓకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

దళితులను వేధించడం తగదు



ఆక్రమణకు గురైన భూములను పరిశీలిస్తున్న సత్యవేడు మండల సిపిఎం కార్యదర్శి మెలుగు రమేష్

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు మండలం, అప్పయ్యపాలెం గ్రామ దళితుల భూములను ఆక్రమించుకొని వేధిస్తున్న తమిళనాడుకు చెందిన ప్రకాష్ నాయుడుపై ఎసీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సత్యవేడు మండల సిపిఎం కార్యదర్శి మెలుగు రమేష్ డిమాండ్ చేశారు. 6వ తేదీన అప్పయ్యపాలెం గ్రామ దళితవాడలో భూ వివాదాలపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఘటన స్థలాన్ని ఆయన శుక్రవారం సందర్శించి సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బాధితులు ఆయనకు తమ గోడు వివరించారు. ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో గత మూడు సంవత్సరాలుగా తమిళనాడుకు చెందిన ప్రకాష్ నాయుడు సత్యవేడు మండలం, అప్పయ్యపాలెం గ్రామంలోని తమ భూములను ఆక్రమించుకున్నాడని తెలిపారు. సర్వేలో ఆ భూములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందనవని తెలిసినా తమపై దాడులు జరిపిస్తూ, బెదిరింపులకు గురిచేస్తున్నాడన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు తమను తిప్పించుకుంటున్నారే తప్ప సమస్యను పరిష్కరించడంలేన్నారు. దళితుల భూములను ఆక్రమించుకుని, వారిపై దాడి చేయడం సరికాదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రమేష్ హెచ్చరించారు. ప్రకాష్ నాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పయ్యపాలెం దళితులు కాటయ్య, కిష్టమ్మ, యాగమ్మ లక్ష్మి, రమణమ్మ, శశికళ, టి,లక్ష్మి, రవి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని కాపాడండి

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): ప్రభుత్వం ద్వారా రేణిగుంట మండలం కొత్తపాలెం గ్రామ రెవెన్యూ దాఖలాలో సర్వే నంబర్లు 104/1ఏలో 2.97, 104/5ఏ 89 సెంట్లు కలిపి ఎ3.86 సెంట్లు భూమిని తన భార్య భాగ్యలక్ష్మి పేరుపై పట్టా మంజూరు చేశారని, అయితే కొందరు వ్యక్తులు ఈ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని భాగ్యలక్ష్మి భర్త చంద్రశేఖర్ వాపోయారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ అధికారులు స్పందించి తమ భూమిని కాపాడాలని కోరారు.

మా ప్లాట్లను మాజీ మంత్రి ఆక్రమించారు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): తిరుపతి సబ్ డివిజన్ చంద్రగిరి తాలూకా అక్కారం పల్లి గ్రూపు కొంకాచెన్నాయిగుంట గ్రామ లెక్క దగ్గర సర్వేనెంబర్ 174/1ఎ, 174/1బి లో 7 సెంట్ల ప్లాట్ ను 1981లో అమరా, మునెమ్మల నుండి తన తండ్రి నక్కా నరసింహులు కొనుగోలు చేశారని, అయితే తమకు చెందిన ఆరు ఫ్లాట్ల భూమిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డి ఆక్రమించుకున్నారని బాధితులు నక్కా సుధీర్ ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తగిన విచారణ జరిపించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

భూమన రాజకీయాలకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతిలో ఎన్నడూ లేనివిధంగా దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు చేయించి పోలీసులతో ఎన్నికలు నిర్వహించిన మాజీ శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు భూమన అభినయ రెడ్డిలు ప్రశాంతత గురించి, ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమన కరుణాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉండే సమయంలో తిరుపతిలో ఏ ఎన్నికలైనా ప్రశాంత వాతావరణంలో జరిపారా ఒక్కసారి ఆత్మసాక్షిగా పరీక్షించుకోవాలన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబం రాజకీయాలకు స్వస్తి పలకాలని కూటమి ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శీను యాదవ్ శీను యాదవ్, శ్రీధర్, జగన్నాథం, చంద్రశేఖర్ రెడ్డి, రవి, బాలాజీ, మణినాయుడు పాల్గొన్నారు.

ఆదివారం సరిగమప సీజన్ 16 ఫినాలే

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సరిగమప సీజన్ -16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ ఫినాలే, ఫిబ్రవరి 9 ఆదివారం సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో ప్రసారం కానున్నట్టు ఓ ప్రకటనలో తెలిరు. ఈ సీజన్‌కు యాంకర్‌గా శ్రీముఖి వ్యవహరిస్తుండగా, సంగీత దర్శకుడు కోటి, గాయని ఎస్పీ శైలజ, పాటల రచయిత కాసర్ల శ్యామ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

భూముల నష్టపరిహారం మంజూరుపై హర్షం

ప్రజాశక్తి -కోట : క్రిస్ సిటీ సాగు రైతుల భూముల నష్టపరిహారం ఎకరాకు 8 లక్షలు రూపాయలను ప్రకటించడం సంతోషదాయకంగా ఉందని కొమారి వెంకయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం కోట మండలంలోని గున్నంపడియ గ్రామం వద్ద ఆయా రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొమారి వెంకయ్య గౌడ్ మాట్లాడుతూ క్రిష్ సిటీ సాగు రైతులకు సంబంధించిగురువారం జరిగిన కేబినెట్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి ప్రకటించిన భూ నష్ట పరిహారం ఎకరాకు ఎనిమిది లక్షలు ప్రకటించడం జరిగిందన్నారు.

జగన్ 2.0 కార్యకర్తల క్షేమం కోసం కాదు

ప్రజాశక్తి - క్యాంపస్ : జగన్ 2.0 కార్యకర్తల క్షేమం కోసం కాదని రౌడీలను కోసమేనని, రౌడీలను పెంచి పోషించాడనికేనని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ జగన్ 1.0 రాష్ట్ర ప్రజల కోసం ఆలోచించారాని, కార్యకర్తలను పాట్టించుకోలేదని జగన్ 2.0 మొత్తం కార్యకర్తల కోసమేనని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ 1.0 లో రాష్ట్ర ప్రజల కోసమే అయ్యుంటే మరీ వైఎస్సార్‌సీపీ పార్టీ 11 సీట్ ఎందుకు వచ్చాయని ఆయన ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డికి ఇంకా పదవి వ్యామోహం పోలేదని విమర్శించారు.

బీసీలకు నామినేటెడ్ పదవులపై హర్షం

ప్రజాశక్తి - క్యాంపస్ : బీసీలకు నామినేటెడ్ పదవులలో 34 శాతం హామీ ఇవ్వడంపై రాగల ఆనంద్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు చేపడుతున్న రోడ్డు విస్తరణ కార్యక్రమానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పలు వీధులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డులోకి చొచ్చుకొచ్చిన దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య మరింత జటిలం అవుతుందని, ప్రజలు, వ్యాపారులు సహకరిస్తే విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

బీసీల బాంధవుడు చంద్రబాబు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : సీఎం చంద్రబాబు నాయుడు బీసీల బాంధవుడని ఆ పార్టీ బీసీ విభాగం నాయకులు కొనియాడారు. శుక్రవారం జరిగిన సమావేశంలో నామినేటెడ్ పదవుల భర్తీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలలో మిన్నల్ రవి, డా.యం.ఉమేష్ రావు, నెమళ్ళూరు బుజ్జి, మునిరాజా యాదవ్, భాస్కర్, మణి, ఉపేంద్ర, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


నాబార్డ్ నిధులతో గ్రామీణ సంత ఏర్పాటు

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, ముసలిపేడులో నాబార్డ్ నిధులతో గ్రామీణ సంత సముదాయమును ప్రారంభించారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో నైనారు పున్నారావు, ధనుంజయ నాయుడు, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కెవి రమణ, నాబార్డ్ ఏపీఆర్ఓ బృందం, మండల నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

జగన్ ఇస్తే సంక్షోభం.. చంద్రబాబు ఇస్తే సంక్షేమమా?

● ముంతాజ్ హోటల్ అనుమతులపై కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతిలో నూత నంగా నిర్మించిన ముంతాజ్ హెూటలకు వైసీపీ ఆధ్వర్యంలో అనుమతిలిస్తే విమర్శలు గుప్పించిన నోళ్లు, ఇప్పుడు చంద్రబాబు అనుమ తిలిస్తే పొగడ్తలతో ముంచి ఎత్తడం విడ్డూరంగా ఉందని వైయస్సార్సీపి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. స్థానిక పద్మావతి పురంలోని నివాసం వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అలిపిరి సమీపంలో నిర్మిస్తున్న ముంతాజ్ హెూటల్‌కు అన్ని అడ్డంకులు తొలగి పోయాయని, చంద్రబాబు చొరవ తీసుకుని అన్ని అనుమతులు ఇచ్చినట్లు ఓ పత్రిక రాసింది. 2021లో అన్ని అనుమతులు వచ్చాయి, ముంతాజ్ అని పేరు ఉండటం వల్ల హిందుత్వ సంఘాలు వ్యతిరేకించాయి, ఆందోళనలు చేశాయి. జగన్ హయంలో దీనికి ప్రతిపాదనలు వస్తే, చంద్రబాబు ముడుపులు తీసుకుని అను మతులు ఇచ్చారు, దీనిపై ప్రజలు, పెద్దలు ఆలోచించాలన్నారు.



అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేయండి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్) తిరుపతి రూరల్ మండలాన్ని పార్టీలకు అతీతంగా, అధికారులు, పాలకులు కలిసి అభివృద్ధి చేసి రూపురేఖలు మారుద్దామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ యశోద అధ్యక్షతన మండల సర్వ సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలంలో పంచాయతీల వారీగా కావాల్సిన సిసి రోడ్లు, డ్రైనేజ్ కాలవలు, వాటర్ ట్యాంకులు, తదితర మౌలిక వసతులకు సంబంధించిన వివరాలను మండల అధికారులకు ఇవ్వాలన్నారు. రూరల్ మండలంలో రైతులు తమ పొలం దగ్గర ఉన్న కలపను ఇంటి నిర్మాణ అవసరాలకు కొట్టి తీసుకుని వెళితే ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు రైతులని ఇబ్బంది పెడుతున్నారని, దీని గురించి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు, రైతుల విషయంలో సడలింపు ఇవ్వాలన్నారు. హౌసింగ్ నిర్మాణం కింద మంజూరు అయిన ఇల్లు మే లోపల నిర్మించుకోవాలన్నారు. తొండవాడ పరిధిలోనే ఉన్న ప్రభుత్వ కాలనీని మోడల్ కాలనీగా అభివృద్ధి చేస్తామన్నారు. దామినేడులో ఉన్న స్మశాన సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, తహసిల్దార్ కేపీ భాగ్యలక్ష్మి, రూరల్ ఉప తహసిల్దార్ ఆర్ జయంత్ కుమార్ వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్తా చాటిన సెవెన్ హిల్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని వెంకట్రామాపురం, సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో గురువారం ఎ.జి.ఎస్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 44 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ యం.నిరంజన్ బాబు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళశాల కరస్పాండెంట్ యం. సుమలత, బోధన సిబ్బంది అభినందించారు.

అమర రాజాలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అమర రాజా సంస్థల చేయూతతో, రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా, దిగువమాఘం అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకి ఉచిత శిక్షణ, ఉపకార వేతనం, ఉద్యోగావకాశం పొందేందుకు అడ్మిషన్స్ కొరకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన విద్యార్థు లకు ఎలక్ట్రీషియన్ కోర్సులో 12 నెలలు (3 నెలలు ట్రైనింగ్ సెంటర్‌లో, 9 నెలలు కంపెనీలో) శిక్షణ ఇవ్వబడుతుంది. శిక్షణా కాలంలో రూ. 12,632/- ఉపకార వేతనం (స్టైపెండ్) ఇవ్వనున్నట్లు యాజమాన్యం తెలిపారు. ఈ నెల 10న అమర దిగువమాఘం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఇంటర్వ్యూ జరుగుతాయి.

వైసీపీ మండల కన్వీనర్ సస్పెన్షన్ అన్యాయం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ వైయస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా పార్టీకి ఎంతో సేవ చేసిన ఆరణి విద్యానాథరెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయడంపై వైఎస్ఆర్సీపీ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం విద్యానాథరెడ్డి ఇంటివద్ద జరిగిన సమావేశంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కన్వీనర్ విద్యానాథరెడ్డి జనవరి 22న పార్టీకి రాజీనామా పత్రం జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డికి సమర్పించారన్నారు. అయినప్పటికీ ఫిబ్రవరి 5వ తేదీ పార్టీ నుండి సస్పెండ్ ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. విద్యానాథరెడ్డితో పాటు ఆరోజే మరో 50 మంది పార్టీకి రాజీనామా పత్రాలు సమర్పించారని తెలిపారు. ఈ చర్యలు పార్టీకోసం కష్టపడినవారిని ఇబ్బందిపెట్టే విధంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ ఆరణి ప్రతిమారెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎక్కడైనా నిర్బంధంగా వెట్టిచాకిరి చేయిస్తూ ఉంటే వారి గురించి తెలియజేయాలని, అటువంటి వారిని చట్ట ప్రకారం శిక్షించడం జరుగుతుందని గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం పేర్కొన్నారు. గూడూరు ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జడ్జి సుల్తానా బేగం ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించేందుకు అనేక చట్టాలు ఉన్నాయని వాటి గురించి అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సబ్ జడ్జ్ రాజేష్, లాయర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆకాష్‌లో ఎయిమ్ ఫర్ ఎక్సలెన్స్ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఆకాష్ విద్యా సంస్థల డైరెక్టర్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: నీట్, జేఈఈలలో జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్న ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎయిమ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే నైపుణ్యం, జ్ఞానం, మార్గదర్శకత్వంతో కూడిన విద్యా విధానం 'ఎయిమ్ ఫర్ ఎక్సలెన్స్' ప్రోగ్రాం తిరుపతి ఆకాష్ విద్యా సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ (తిరుపతి, నెల్లూరు, కడప) సిహెచ్ విజయ్ కుమార్, అసిస్టెంట్ సేల్స్ హెడ్ నరసింహులు ఇతర ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విధానం ద్వారా విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ హెడ్స్ రామా రమేష్, రఘురాం, పవన్ కుమార్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సాయి రాజ్ కుమార్, ఏఒ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని ఎగువ వీధి పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం రమాబాయి అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రమాబాయి సంఘం వివాహ పరిచయ వేదిక రాష్ట్ర వ్యవస్థాపకుడు రేగంటి దేవానంద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమాబాయి గొప్ప త్యాగమూర్తి, సహనశీలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్ నాయుడు, పోతురాజు, శివకుమార్, నాగమణి, ముని కృష్ణారెడ్డి, సుచిత్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట



ట్రాక్టర్ల వెళ్లు దారి పూడుస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, పెన్నేపల్లి గ్రామ సరిహద్దు స్వర్ణముఖి నదినుండి ఇసుక అక్రమ రవాణాను రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. గత ప్రభుత్వం హయాంలో గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించి ఇసుక రవాణాను అడ్డుకున్నారు. కానీ గత ఆరు నెలలుగా స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహం ఉన్నప్పటికీ రహదారులు ఏర్పాటు చేసుకొని హైకోర్టు ఉత్తర్వులు కూడా లెక్కచేయకుండా ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇసుక తరలించటం వలన మూడు మండలాలకు తాగునీటి సమస్య, వ్యవసాయ భూములకు నీటి సమస్య తలెత్తుతోంది. ఈ సందర్భంగా రెవిన్యూ సిబ్బంది హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసేందుకే ఇసుక రవాణాను అడ్డుకుంటున్నామని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సౌత్ జోన్ ఇంటర్ విశ్వవిద్యాలయ క్రీడల్లో యస్‌జియస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - క్యాంపస్ : 2024-2025 విద్యా సంవత్సరంలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో యస్ జి యస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సత్యనారాయణ తెలిపారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులు జి నవీన్ (క్రికెట్), టీ. డిస్మిత (ఉమెన్ క్రికెట్), డి రఘునాథ్ (బ్యాడ్మింటన్), పి నందకుమార్ (జూడో), కె నాగేశ్వరి (ఉమెన్స్ కబడ్డీ), ఎం భరత్ (వాలీబాల్), టీ మహేష్ (కో కో), షేక్ బాబా ఫక్రుద్దీన్ (హాకీ), సి.మాలిని (వాలీబాల్), ఎన్ఎస్ బాలాజీ (చదరంగం) లను ప్రశంసిస్తూ సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి :ఎమ్మెల్యే విజయశ్రీ



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ

ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రజల సమస్యలు తెలుసుకుని తీర్చేందుకు అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, రానున్న వేసవిలో ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతో పని చేయాలని సూళ్లూరుపేట నియోజకవర్గం శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్ల మరమ్మతులు శరవేగంగా పూర్తి చేసేలా చూడాలని, అంగన్వాడి స్కూళ్లకు బిల్డింగులు లేక ఇబ్బంది పడుతున్న ప్రాంతాలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొనుగొండ్ల ధనలక్ష్మి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి.చంద్రశేఖర్ రెడ్డి, పసల గంగా ప్రసాద్, ఎంపీడీవో శివ కుమార్, ఎమ్మార్వో ఏ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కారు ఢీ : వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, టెంకాయ తోపు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన మందం వెంకటరత్నం (60) అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా, తిరుపతి నుండి నాయుడుపేట వైపు వెళుతున్న కారు ఢీ కొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స కోసం వచ్చి వ్యక్తి మృతి



ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలం, వికృతమాల, మర్రిమందకు చెందిన బాసెట్టి వెంకటేష్ రుయా ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం ఓపీ తీసుకొని ఆసుపత్రి ప్రాంగణంలో ఉలుకు పలుకు లేకుండా పడిపోయాడు. వైద్యులు వచ్చి పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

ముద్దుకృష్ణమనాయుడుకు నివాళి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఏడవ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని స్థానిక కార్వేటి నగర్ రోడ్డులో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్ ఆధ్వర్యంలో ముద్దుకృష్ణమ నాయుడు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా పుష్పాంజలి ఘటించారు. అనంతరం పుత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దుప్పట్లు దిండు కవర్లు పంపిణీ చేశారు.

ఏర్పేడు మండలంలో..

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు మండలం, సీతారాంపేట జగదీష్ వేర్ హౌస్ గోడౌన్స్‌లో హమాలీలు గాలి ముద్దుకృష్ణమనాయుడుకు ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఏర్పేడు మండలంలో పలు గ్రామాల వారికి ఉపాధి కల్పించి మా కుటుంబాలలో ఆయన వెలుగులు నింపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేర్హౌస్ సిబ్బంది, హమాలీలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
I.A.No. 19/2024, A.S.No. 14/2023
1.K.Varalakshmi & others ...Petitioners/Appellants
V/s
S.Kasthuri & others ...Respondents
NOTICE TO RESPONDENTS No.1, 2, 3, 6 & 15
R1) S.Kasthuri, W/o S.Subramanyam, D.No.19-9-51-5C, SC Kennady Nagar, Tirupati Post & Town, Tirupati District
R2) M.Chengamma, w/o late M.Krishnaiah, D.No.2-2-205B, Chintakalva Street, Tirupati Post & Town, Tirupati District
R3) D.Nagulu, D/o D.Venkatesh Mandadi, Parasala Street, Tirupati Post & Town,Tirupati Dist.
R4) P.Jyothi, D/o late P.Balaram, D.No.4-1-13C, Patnool Street, Tirupati Post & Town, Tirupati Dist.
R15) A.Revathi Reddy, W/o V.Venugopal, D.No.16-5-400, Kasthuribai lane, Tirupati Post & Town, Tirupati District
Please take notice that the Petitioners/Appellants filed the above petition in I.A.No. 19/2024 for the grant of temporary injunction restraining the respondents 1 to 9 their men from in any way interfering with the peaceful possession and enjoyment of the petition schedule property and the matter is posted for your appearance before the above said Hon'ble Court on **20-02-2025** at 10:30AM either in person or through your counsel. In the event of your failure to appear the matter will be decided Ex-Parte.
Hearing Date: 20-02-2025
(By Order of the Court)
M.VIJAYSEKHAR
Advocate for Claim petitioner, Tirupati.
Cell: 9701185012

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
A.S.No. 14/2023
1.K.Varalakshmi & others ...Appellants
V/s
S.Kasthuri & others ...Respondents
NOTICE TO RESPONDENTS No.1, 2, 3, 6 & 15
R1) S.Kasthuri, W/o S.Subramanyam, D.No.19-9-51-5C, SC Kennady Nagar, Tirupati Post & Town, Tirupati District
R2) M.Chengamma, w/o late M.Krishnaiah, D.No.2-2-205B, Chintakalva Street, Tirupati Post & Town, Tirupati District
R3) D.Nagulu, D/o D.Venkatesh Mandadi, Parasala Street, Tirupati Post & Town,Tirupati Dist.
R4) P.Jyothi, D/o late P.Balaram, D.No.4-1-13C, Patnool Street, Tirupati Post & Town, Tirupati Dist.
R15) A.Revathi Reddy, W/o V.Venugopal, D.No.16-5-400, Kasthuribai lane, Tirupati Post & Town, Tirupati District
Please take notice that the Appellants filed the above appeal to set aside the judgment and decree made in O.S.No.124/2014 and the matter is posted for your appearance before the above said Hon'ble Court on **20-02-2025** at 10:30AM either in person or through your counsel. In the event of your failure to appear the matter will be decided Ex-Parte.
Hearing Date: 20-02-2025
(By Order of the Court)
M.VIJAYSEKHAR
Advocate for Claim petitioner, Tirupati.
Cell: 9701185012

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
I.A.No. 20/2024, A.S.No. 14/2023
1.K.Varalakshmi & others ...Petitioners/Appellants
V/s
S.Kasthuri & others ...Respondents
NOTICE TO RESPONDENTS No.1, 2, 3, 6 & 15
R1) S.Kasthuri, W/o S.Subramanyam, D.No.19-9-51-5C, SC Kennady Nagar, Tirupati Post & Town, Tirupati District
R2) M.Chengamma, w/o late M.Krishnaiah, D.No.2-2-205B, Chintakalva Street, Tirupati Post & Town, Tirupati District
R3) D.Nagulu, D/o D.Venkatesh Mandadi, Parasala Street, Tirupati Post & Town,Tirupati Dist.
R4) P.Jyothi, D/o late P.Balaram, D.No.4-1-13C, Patnool Street, Tirupati Post & Town, Tirupati Dist.
R15) A.Revathi Reddy, W/o V.Venugopal, D.No.16-5-400, Kasthuribai lane, Tirupati Post & Town, Tirupati District
Please take notice that the Petitioners/Appellante filed the above petiton in I.A. No.20/2024 for Pile grant of temporary injunction restraining the respondents 1 to 9 their men in any way alienating, mortgaging, creating charge or burdening the petition schedule property and the matter is posted for your appearance before the above said Hon'ble Court on **20-02-2025** at 10:30AM either in person or through your counsel. In the event of your failure to appear the matter will be decided Ex-Parte.
Hearing Date: 20-02-2025
(By Order of the Court)
M.VIJAYSEKHAR
Advocate for Claim petitioner, Tirupati.
Cell: 9701185012

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కళాశాలలో "నేషనల్ రోడ్డు సేఫ్టీ మంత్ లో భాగంగా రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచే లక్ష్యంతో వే ఫౌండేషన్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ - 9,10,12 ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి మురళీ మోహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రహదారి నిబంధనలను పాటించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు సుబ్రమణ్యమ్, శ్రీనివాస రావు, అటిక


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి మురళీ మోహన్

నాజ్, పూజా వాణి, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ నృత్య కళాకారులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయండి


నులి పురుగుల నిర్మూలనపై గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జిల్లా కలెక్టర్, తిరుపతి జిల్లా, ఆదేశాల మేరకు 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించాలని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ ఆధ్వర్యంలో గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్ డిపార్ట్మెంట్స్ అందరు మాత్రలు పంపిణీ చేయవలసినదిగా ఆదేశించారు. అంగన్వాడీ, పాఠశాలలకు, కాలేజీలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపినీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నులి పురుగులు నివారిద్దాం


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు రామయ్య

ప్రజాశక్తి - వాకాడు: శుక్రవారం మండల తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ ఎస్ రామయ్య అధ్యక్షతన 10వ తేదీ జరగబోవు నులిపురుగుల నివారణ దినోత్సవం గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ టీచర్లు, అంగన్వాడీ సిబ్బంది, ఆషా వర్కర్స్, పాఠశాలలో పిల్లలు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పని సరిగా మింగించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఓపియమ్ అన్నపూర్ణ రావు, బాలిరెడ్డి పాలెం మెడికల్ ఆఫీసర్ బి.రంగ దీప్తి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఐ.సలోమి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తన సాహిత్యోద్ధారకుడు వేటూరి


వేటూరి ప్రభాకరశాస్త్రి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : తాళ్లపాక అన్నమయ్య రచించిన సంకీర్తనా సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చి భారతజాతికి అందించిన మహనీయుడు వేటూరి ప్రభాకరశాస్త్రి అని ఎస్వీ విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధనా సంస్థ డైరెక్టర్ ఆచార్య వేంకటేశ్వర్లు కొనియాడారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుపతిలోని శ్వేత భవనం ఎదురుగా ఉన్న వేటూరి ప్రభాకరశాస్త్రి విగ్రహానికి టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు రాజగోపాల రావు, గౌరిపెద్ది శంకర భగవత్పాదులు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. సీతారామారావు, డా. రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన రాజశ్యామలాదేవి నవరాత్రి మహోత్సవాలు


శ్రీ శక్తి పీఠంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రామచంద్రాపురం:
మండలంలోని రాయల చెరువు కట్ట సమీపంలో ఉన్న శ్రీ శక్తి పీఠంలో శ్రీ రాజశ్యామలా దేవి నవరాత్రులు ఘనంగా ముగిశాయి. శుక్రవారం ఉదయం కుర్తాళం సిద్దేశ్వరి పీఠం పీఠాధిపతులు శ్రీ శక్తి పీఠ వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి శ్రీ రాజశ్యామలాదేవికి పంచామృత అభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో విశేషంగా అలంకరించి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ రాజశ్యామలా దేవికి 108 సుగంధ ద్రవ్యాలతో హోమం నిర్వహించారు. భక్తులకు రాజశ్యామలాదేవిని దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించారు. మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతజీ శ్రీ రమ్యానందభారతీ స్వామినీ చే మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ భక్తుల ఓం శక్తి నామస్మరణల నడుమ భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి నిర్వహించారు. స్త్రీ మూర్తులకు సువాసినీ పూజ నిర్వహించారు. భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు అందజేశారు.

మత్స్యకారులకు జెట్టి నిర్మాణం కోసం భూమి పరిశీలన


సముద్ర తీరంవద్ద భూమి పరిశీలనలో కటారి జయజయరావు తదితరులు

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని గోవిందపల్లి గ్రామంలో మత్స్యకారుల జెట్టి నిర్మాణం కొరకు స్థానిక తహసీల్దార్ కటారి జయ జయ రావు ఆధ్వర్యంలో సముద్ర తీరం సమీపంలో ఆయా భూమిని పరిశీలించారు. దీనితో రానున్న రోజుల్లో మత్స్యకారులకు పలు రకాల ఉపాధి ఉండవచ్చునని వారు భావిస్తున్నారు. తాహసిల్దార్‌తో పాటు మెరైన్ సబ్ ఇన్స్పెక్టర్ శివ సౌమ్య, ఫిషరీ డిపార్ట్మెంట్ రెడ్యానాయక్, మండల సర్వేయర్ గోపిరెడ్డి, విలేజ్ సర్వేయర్ బ్రహ్మయ్య,విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ నాగరాజు, విఆర్ఓ వెంకటేశ్వర్లు,మత్స్యకారులు ఉన్నారు.

సాయి సత్సంగ నిలయంలో ప్రత్యేక పూజలు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని సాయి సత్సంగ నిలయంలోని శ్రీ విజయ దుర్గ ఉప పీఠం నందు శ్రీ విజయ దుర్గ అమ్మవారి స్వరూప శ్రీ రాజశ్యామల మాతాంగి అమ్మవారి నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిసాయి .హెూమం మహా పూర్ణాహుతి పలు రకాలు సుగంధ ద్రవ్యాలతో విజయ దుర్గ అమ్మవారికి అభిషేకం నిర్వాహకులు కోట సునీల్ కుమార్ ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి.

ఉత్తమ ఎస్ఐని సన్మానించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎస్ఐ విశ్వనాథ నాయుడుకు అవార్డు రావడం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఎస్సై విశ్వనాథ నాయుడుకి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కందేరి కార్తీక్ నాయుడు, రామనాథం, కుమార్, భాస్కర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని గూడూరు డిఎస్పీ గీత పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. మున్సిపల్ వర్కర్స్, స్థానికుల సహాయంతో పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ సీఐ శేఖర్ బాబు , ఎస్ఐ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు సీఐ జయచంద్ర హెచ్చరిక

ప్రజాశక్తి -ఏర్పేడు : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మందుబాబులను సీఐ జయచంద్ర హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కోబాక గ్రామ సమీపంలో మద్యం ప్రియులు పడేసిన మద్యం బాటిల్స్ వ్యర్థాలను పంచాయతీ డిపార్ట్మెంట్ తో కలిసి శుభ్రపరచి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

లోకనాథ ఆచారి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉపాధ్యాయుడు లోకనాథం ఆచారి సేవలు అభినందనీయమని పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్ రాజు కొనియాడారు. శుక్రవారం ఆయన పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

మల్లీశ్వరికి డాక్టరేట్

ప్రజాశక్తి - పిచ్చా టూరు (తిరుపతి జిల్లా): పిచ్చాటూరు, జడ్పీ హైస్కూల్ హిందీ పండిట్, సామాజిక కార్యకర్త రాయల మల్లీశ్వరి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ నుండి డాక్టరేట్ అందుకోనున్నారు. డివినిటీ మరియు సోషల్ సర్వీస్ అనే అంశంపై ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ ఆమెను గుర్తించి ఆదివారం హైదారాబాద్‌లో డాక్టరేట్ ప్రదానం చేయనుంది.

కిల్ గేమ్ స్టార్స్ షార్ట్ చిత్రాన్ని ఆదరించండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రేక్షకులు, అభిమానులు కిల్ గేమ్ స్టార్స్ షార్ట్ చిత్రాన్ని ఆదరించి అభిమానించాలని చిత్ర నిర్మాత డాక్టర్ షీలా లోకనాథన్ కోరారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో సాయి కళ ఫౌండేషన్ చైర్మన్ మధుసూదన్, టేక్ వాండో డిస్ట్రిక్ ప్రెసిడెంట్ ధనంజయ శుక్రవారం ఈ చిత్రాన్ని క్లాప్ కొట్టి ప్రారంభించారు. మహిళా సాధికారత ఈ చిత్ర ప్రధానాంశమని తెలిపారు

మామిడి పూతకు మంచు పురుగు దెబ్బ

ప్రజాశక్తి - బుచ్చినయుడు కండ్రిగ : కొద్ది రోజులుగా కురుస్తున్న తేనే మంచు ప్రభావంతో వచ్చే పురుగు వలనే మామిడి చెట్లలల్లో పూత రావటం లేదని మండల ఉద్యావన శాఖాధికారిణి యామిని తెలిపారు. ఆమె గురువారం కనమనంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ గ్రామాల్లోని మామిడి తోటలలో మామిడి చెట్లను పరిశీలించి, రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వివరాలకు సెల్ 7995086941 నెంబరుకు ఫోన్ చేస్తే మామిడి, మిరప పంటల సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇస్తానన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు వెళ్ళే విధంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపిడివో మధుసూదన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గూడూరు పట్టణంలోని ఎంపిడివో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ సిద్ధమైన ఎరువులతో పంటలు పండించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్, ఈ.వో.పి.ఆర్డి మోహన్, ఏ.పి.ఎం బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.